మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

ఆక్వా ఫీడ్‌పై భారం హేయం

■ **టన్నుకు రూ.11 వేలు పెంచడం దారుణం : వడ్డి రఘురాం**



తాడేపల్లిగూడెం: ఆక్వా ఫీడ్‌పై మరోసారి ధరల భారం పడిందని, టన్నుకు రూ.11 వేలు పెంపు హేయం అని తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైయస్సార్‌సీపీ సమన్వయకర్త, అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ఉద్దేశపూర్వకంగా తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందని ఆయన ధ్వజమెత్తారు. ఫీడ్ కంపెనీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, హేచరీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, చిన్న ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జగన్ హయాంలో ఆక్వా రంగానికి రక్షణగా తీసుకొచ్చిన చట్టాల ను బలహీనపరుస్తున్న ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతుందని తాడేపల్లిగూడెంలో స్పష్టం చేశారు. ప్రెస్‌మీట్‌లో ఇంకా ఏమన్నారంటే..

చట్టాన్ని నిర్వీర్యం చేసిన జీఓ నెం:180

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు ఎంతో చిత్తశుద్ధితో ఫీడ్, సీడ్, ప్రొక్యూర్మెంట్, హేచరీలను ఒకే గొడుగు కిందకు తెస్తూ 'అప్పడా చట్టం 2020'ని తీసుకువచ్చారు. కానీ చంద్రబాబు ఆ బలమైన చట్టాన్ని నీరుగార్చేలా జీఓ నెం:180 తీసుకొచ్చారు. కోర్టు ఆదేశాల ప్రకారం ముఖ్యమంత్రి సమక్షంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ధరలపై నిర్ణయం తీసుకోవాలి. కానీ చంద్రబాబు అసలు రైతులతో ఎక్కడైనా ఫిజికల్ మీటింగ్ పెట్టారా? ఒక్క ఆధారమైనా చూపించగలరా? గత ఎనిమిది మాసాల్లోనే రెండు దఫాలుగా రూ.16 పెంచారు. ఇప్పుడు మళ్లీ రూ.11 పెంచుకునేందుకు కుట్రలు పన్ని, మొత్తంగా రూ.27 మేర ఫీడ్ భారాన్ని రైతులపై మోపారు. ఆక్వా రంగానికి సంబంధించి పార్టీలకు అతీతంగా త్వరలోనే ఐక్య వేదికను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని వడ్డీ రఘురాం స్పష్టం చేశారు.